

అపోహలు వీడుదాం..

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం. జిల్లాలో రక్తనిల్వలు తక్కువగా ఉన్నాయి.

- 8లో



సుసం'పెన్'మైన ఆలోచన

కాశీబుగ్గ హైస్కూల్‌లో ఓ వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వాడి పడేసిన పెన్నులు సేకరిస్తున్నారు.

- 8లో

ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎచ్చెర్లలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రామీణ యువకులకు సెల్‌ఫోన్ సర్వీసింగ్‌లో ఈనెల 23 నుంచి 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్.రామ్‌జీ తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9553410809, 7993340407 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

న్యూస్‌రీల్

ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తల్లికి వందనం పథకం ప్రయోజనాలను విద్యార్థులు సకాలంలో పొందాలంటే తమ బ్యాంకు ఖాతాలను జాతీయ చెల్లింపుల సంస్థ(ఎన్‌పీసీఐ)తో అనుసంధానం చేయించుకోవడం అత్యవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. షెడ్యూల్డు కులాల 9వ, 10వ తరగతుల్లో చదువుతున్న విద్యార్థులకు అందే నిధులను వారి తల్లుల ఖాతాల్లోకి జమ చేయనున్నారు. అంతేకాక, ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నిధులు వారి వ్యక్తిగత ఖాతాల్లోకి జమ కానున్నాయి. తల్లులు, విద్యార్థులు తమ ఖాతాలను వెంటనే జాతీయ చెల్లింపుల సంస్థతో అనుసంధానం చేయించుకోవాలని ఆయన సూచించారు. ఖాతా లేకపోతే తపాలా కార్యాలయంలో పోస్ట్ కార్యాలయ ఖాతా తెరిచి, దాన్ని కూడా తగిన విధంగా అనుసంధానం చేయించుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటికీ 1360 మంది విద్యార్థులు ఖాతాలను అనుసంధానం చేయించుకోలేదని కలెక్టర్ తెలిపారు. పథకం ద్వారా లబ్ధి పొందాలంటే ఖాతా అనుసంధానం తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

కూటమికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులకు సుప్రీం కోర్టు తీర్పు చెంప పెట్టు వంటిదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు బెయిల్ మంజూరుపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కొమ్మినేనిని అకారణంగా కూటమి ప్రభుత్వం అరెస్టు చేసిందని మండిపడ్డారు.ఎల్లో మీడియా గ్యాంగుతో కలిసి కొమ్మినేనిపై తప్పుడు ఆరోపణలు చేసి విష ప్రచారం చేశారని అన్నారు. కొమ్మినేనికి బెయిల్ ఇచ్చి సుప్రీం కోర్టు తగిన బుద్ధి చెప్పిందన్నారు. 'సాక్షి' మీడియా ఆస్తులను కూటమి నాయకులు ధ్వంసంపై చేయడాన్ని ఖండించారు.

కూటమి హామీలన్నీ ఏమయ్యాయి..?



దుంపల రామారావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలు ఏమయ్యాయ ని వైఎస్సార్ సీపీ కళింగకుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు (లక్ష్మణరావు) ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తల్లికి వందనంలో కోత పెట్టడం సరికాదన్నారు. పేద విద్యార్థుల చదువు కోసం దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ప్రభుత్వం పంగనామం పెట్టిందని ఆరోపించారు. ఉచిత బస్సు లేదు, అన్నదాత సుఖీభవ లేదు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ లేదని మండిపడ్డారు. చేసిన తప్పులు ఎత్తిచూపే సాక్షి మీడియా, సాక్షి కార్యాలయాలపై దాడి చేసి ఆస్తులు ధ్వంసం చేయడం దారుణమన్నారు.


'ఏడాది పాలనంతా మోసం'



కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనంతా మోసమేనని వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 5.32లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పేరు మార్చినా నగదు రాలేదన్నారు. ఇప్పటికే ఒక ఏడాది ఎగ్గొట్టేశారని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఈ ఏడాది తొలి విడత డబ్బులు కూడా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఇచ్చిన ప్రాధాన్యత మరే ఇతర సంక్షేమానికి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వెన్నుపోటు చంద్రబాబుకి కొత్తేమీ కాదని అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఇలానే మోసం చేయడం, ప్రజలకిచ్చిన హామీలు అమలుచేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు.

సంక్షేమానికి ఆంక్షల సంకెళ్లు





- తల్లికి వందనం ఆంక్షలపై లబ్ధిదారుల్లో వ్యతిరేకత
- సర్పంచ్‌లుగా ఉన్న తల్లులను సైతం అనర్హులుగా ప్రకటించిన ప్రభుత్వం
- మొదటి ఏడాది బకాయిలపై లేని స్పష్టత



విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

కూటమి సర్కారు సంక్షేమానికి ఆంక్షల సంకెళ్లు విధించింది. ఎలాగోలా లబ్ధిదారుల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా తల్లికి వందనంపై సవాలక్ష ఆంక్షలు పెట్టింది. ఒక చేత్తో డబ్బులు ఇస్తూ.. రెండో చేత్తో లబ్ధిదారుల సంఖ్యను కుదించేస్తోంది. ఎన్నికల సమయంలో నీకు రూ.15వేలు నీకు రూ.15వేలు అని ప్రచారం చేసి ఇప్పుడు రూ.13వేలకు పరిమితం చేశారు. వైఎస్ జగన్ హయాంలో స్కూలు బాగోగుల కోసం అమ్మ ఒడి నిధులు కేటాయిస్తే మైకు పట్టుకుని విమర్శించిన నాయకులు ఇప్పుడు మౌనంగా అదే పనిచేస్తూ దొరికిపోయారు.

కోతల కోసం ఎన్నో కుయుక్తులు..


జిల్లాలో గత ఏడాది ఒకటి నుంచి ఇంటర్(+2) వరకు 3.05లక్షల మంది చదువుకున్నారు. వీరిందరికి కలిపి మొదటి ఏడాది రూ.457 కోట్ల నిధులను కూటమి ప్రభుత్వం బాకీ పడి ఉంది. ప్రస్తుతం యూ–డైస్ లెక్కల ప్రకారం ఒకటి నుంచి పదో తరగతి వరకు 2,76,593 మంది, అలాగే ఇంటర్మీడియెట్ 46,761 మంది చదువుతున్నారు. ఒకటి నుంచి ఇంటర్ మొత్తం కలిపి 3,02460 మంది ఉన్నారు. వీరిలో బాలురు 1,54,966 మంది, బాలికలు 1,47,494 మంది ఉన్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయితే వీరిలో ఎంత మందికి డబ్బులు పడతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనల చిట్టా విడుదల చేయడంతో డబ్బులు పడని అర్హులంతా ఆందోళన చెందుతున్నారు.

ని'బంధనాలు'


- కూటమి అధికారం చేపట్టి ఏడాది గడిచిపోయింది. తాజాగా రెండో ఏడాదికి సంబంధించి తల్లికి వందనం పథకం అమలుకు సంబంధించి జీఓ మాత్రమే విడుదల చేశారు. అంటే మొదటి ఏడాదికి ఇక లేనట్టే.
- వింతగా గత విద్యా సంవత్సరం డేటా తీసుకున్నప్పటికీ.. ప్రస్తుత విద్యా సంవత్సరాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు.
- ప్రభుత్వ లెక్క ప్రకారం చూస్తే ఇటీవల టెన్త్ పరీక్షలు రాసి ఇంటర్‌లో చేరిన విద్యార్థులకు మాత్రమే లబ్ధి చేకూరనుంది. పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో చేరినవారు అనర్హులు కానున్నారు. అలాగే ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులను కూడా అనర్హులుగా పరిగణించారు.
- వేసవిలో కాసింత ఎక్కువ కరెంటు వాడి ఉంటే ఇక అంతే సంగతి. 300 యూనిట్లు దాటిన వారిని అనర్హులుగా ప్రకటించారు.
- ముఖ్యంగా గ్రామాల్లో సర్పంచ్‌లను సైతం అనర్హులుగా ప్రకటించారు.
- వారికి నెలవారీ జీతాలు సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లింపులు జరుగుతుండటంతో వారిందరినీ అనర్హులుగా ప్రకటించారు. గతంలో వైఎస్ జగన్ హయాంలో ఇలాంటి కోతలు లేవు.

ట్రెండింగ్‌లో లోకేష్ వ్యాఖ్యలు..

తల్లికి వందనంలో రూ.2వేలు కోత విధించినప్పటి నుంచి మంత్రి నారా లోకేష్ పాత వీడియోలు తెగ ట్రెండ్ అవుతున్నాయి. వైఎస్ జగన్ హయాంలో బడి బాగు కోసం రూ.వెయ్యి తగ్గిస్తే.. నారా లోకేష్ తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు ఏకంగా రూ.2వేలు కోత పెట్టడంతో అంతా పాత వీడియోలను గుర్తు చేస్తూ విమర్శలు చేస్తున్నారు. నాడు దుమ్మెత్తిపోసిన నోరు ఇప్పుడేమైందని ప్రశ్నిస్తున్నారు.



అమ్మఒడి విధివిధానాలు వెల్లడిచేసిన సమయంలో ట్విట్టర్ వేదికగా 2022 ఏప్రిల్ 15వ తేదీన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లోకేష్ చేసిన ఆరోపణలు



సంతసీతారంపురం సచివాలయం పరిధిలో అనర్హులని చెబుతూ ప్రభుత్వం ప్రకటించిన తల్లుల వివరాలు ఇవి

ఇన్ని ఆంక్షలా..?



ఖాతాలో రూ.15 వేలు వేస్తామని, ఇప్పుడు రూ.13 వేలు వేయడం అన్యాయం. నిబంధనలు పెట్టి తల్లుల ఖాతాలో నగదు వేయకపోవడం, భూములు, విద్యుత్ బిల్లులతో అనేక కొర్రీలు పెట్టాలనుకోవడం దారుణం. ఇప్పటికైనా చదువుకునే విద్యార్థులందరికి తల్లికి వందనం వర్తింపు చేయాలి.

– దాంపురం రాజ్యలక్ష్మి, రంకిణి గ్రామం, పాతపట్నం

తల్లికి వందనం అందలేదు



నా పిల్లలు ఇంటర్ చదువుతున్నారు. నా భర్త మదన్ సర్పంచ్ కావడంతో మాకు తల్లికి వందనం ఇవ్వలేదు. మాకు భూములు లేవు, పెద్దగా ఇతర ఆస్తులు లేవు. అయినా ఎందుకో మా మీద కక్ష గట్టి ఆపినట్టు ఉంది.

– తామాడ జ్యోత్స్న, గృహిణి, బొద్దపాడు, పలాస మండలం

గతంలో ఈ నిబంధన లేదు



కూటమి ప్రభుత్వం సర్పంచ్‌ను ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించి తల్లికి వందనం అనర్హత జాబితాలో సర్పంచ్‌ల పేర్లు పెట్టింది. గత ప్రభుత్వంలో ఇలాంటి నిబంధన లేదు. – నంది సోనియా, రుషికుద్ద సర్పంచ్

తల్లికి వందనంలో కోత సిగ్గు చేటు



తల్లికి వందనం కోతపై శ్రీకాకుళంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థుల ర్యాలీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్నికల సమయంలో తల్లికి వందనం కింద రూ.15వేలు ఇస్తానని చెప్పిన నాయకులు పాఠశాల అభివృద్ధి పేరుతో రూ.2వేలు కోత పెట్టడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు అన్నారు. దీనిపై నిరసన తెలుపుతూ శ్రీకాకుళం నగరంలో సూర్యమహల్ జంక్షన్ నుంచి సెవెన్ రోడ్ జంక్షన్ వరకు 200 మంది విద్యార్థులతో శుక్రవారం భారీర్యాలీ నిర్వహించారు. కుటుంబ ఆదాయం గ్రామాల్లో నెలకు రూ. 10వేలు, పట్టణాల్లో రూ.12వేల లోపు ఉండాలని, రైస్ కార్డు ఉండాలని, ఫ్యామిలీకి 3 ఎకరాల్లోపు మాగాణి, లేదా 10 ఎకరాల్లోపు పొడి భూమి, లేదా రెండూ కలిపి 10 ఎకరాల్లోపు ఉండాలని, ఫోర్ వీలర్స్ ఉండకూడదని నిబంధనలు పెట్టడం అన్యాయమన్నారు. చాలా మందికి సాంకేతిక సమస్యలంటూ ఎగ్గొట్టే ప్రయ త్నం చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆటో గ్యాంగ్ ఆటకట్టు

- పోలీసులకు దొరికిన ఆటో గ్యాంగ్
- నిందితులు విజయనగరం వాసులు



పట్టుబడిన నిందితులతో ఎస్ఐ రామారావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలో ఇటీవల రెచ్చిపోయిన ఆటో గ్యాంగ్ ఆటను పోలీసులు కట్టించారు. ఈ గ్యాంగ్‌కు సంబంధించి విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..

వృద్ధదంపతులను ఏమార్చి..

ఈ నెల 5న ఎచ్చెర్ల మండలం కొత్తపేట పంచాయతీ సాకివానిపేటకు చెందిన వృద్ధ దంపతులు కోరాడ రమణ, రామలక్ష్మిలు శ్రీకాకుళంలో ఆటోలో ప్రయాణిస్తుండగా పుస్తెలతాడు దొంగిలించారు. అదే రోజు వృద్ధ దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్ఐ రామారావు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం వాహన తనిఖీల్లో భాగంగా తోటపాలెం జంక్షన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ రామారావు, సిబ్బందికి సరిగ్గా ఉదయం పది గంటల సమయంలో ఏపీ 30విడి440 నంబరు గల బజాజ్ మాక్సిమా ఆటో మీద వస్తున్న మహిళలపై అనుమానం కలగడంతో వెంటనే అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెట్టాడ గ్రామానికి చెందిన గొర్లె మౌనిక, గొర్లె పెద్దింట్లమ్మ, అదే జిల్లా కొత్తవలస మండలం చీడివలసకు చెందిన ఆటో డ్రైవర్ మేకల హరిలుగా పోలీసులు గుర్తించారు. పెద్దింట్లమ్మ, మౌనికలు తల్లీ కూతుళ్లు కాగా, హరి పెద్దింట్లమ్మకు మేనల్లుడు అవుతాడు.

లెక్కకు మించి కేసులు..

వీరిపై ఇతర జిల్లాల్లో, మన జిల్లాలోని రూరల్‌తో కలిపి పదికి మించి కేసులున్నాయని ఎస్ఐ రామారావు తెలిపారు. వీరిదో గ్యాంగు అని, ఈ కేసుకు సంబంధించి వీరే నిందితులని, గ్యాంగులో మరికొందరు ఉండొచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. నిందితుల నుంచి ఆటోను, బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరించామన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో జీఎస్టీ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బుడుమూరు నాగార్జున పాల్గొని సమావేశాన్ని సమన్వయపరిచారు. కొన్ని సంస్థలు జీఎస్టీలో నమోదు కాలేదని, వాటిని పన్ను పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. లీడ్ బ్యాంక్, ఇతర బ్యాంకు అధికారులకు ఆదేశాలిస్తూ జీఎస్టీ అధికారుల నుంచి నోటీసులో జారీ అయిన పన్ను బకాయి దారులకు సంబంధించిన ఖాతా వివరాలను అందించాలన్నారు. అక్రమ రవాణా నిరోధించడానికి మైనింగ్ అధికారులు, రవాణా శాఖ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖతో సమన్వయంతో పని చేయాలని సూచించారు.

షాపు తొలగిస్తారా.. టీసీలు తీసుకోమంటారా..?

- బడికి రాని ఈదుపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు
- మద్యం షాపు తొలగిస్తేనే స్కూలుకు పంపిస్తామన్న తల్లిదండ్రులు



విద్యార్థులు హాజరు కాకపోవడంతో బోసిపోయిన ఈదుపురం ఉన్నత పాఠశాల



బడికి సమీపంలో పెట్టిన మద్యంషాపు వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ఇచ్ఛాపురం రూరల్: 280 మందికి పైగా విద్యార్థులు, 15 మంది ఉపాధ్యాయులు ఉన్న ఈదుపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఒక్క విద్యార్థి కూడా కనిపించలేదు. ఒక్కరు కూడా రాకపోవడంతో ఉపాధ్యాయులు నుంచి మండల విద్యాశాఖాధికారి వరకు అంతా ఆందోళన చెందారు. ఒకే సారి వందలాది మంది విద్యార్థులు బడికి రాకుండా బాయ్‌కాట్ చేయడంతో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు పరుగులు తీసి ఆరా తీశారు. అందరి తల్లిదండ్రులదీ ఒకటే మాట... 'మా పిల్లలు బడిలోకి అడుగు పెట్టాలంటే.. బడికి ఆనుకొని ఉన్న మద్యం షాపును తొలగించాలి. అంత వరకు సాక్షాత్తు కలెక్టర్ మా దగ్గరికి వచ్చినా పిల్లల్ని బడికి పంపించేది లేదు'. అంటూ తెగేసి చెప్పారు. దీంతో చేసేదేమీ లేక ఉపాధ్యాయులు బడికి తిరుగుముఖం పట్టారు.

ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆమడ దూరంలో నాలుగు రోజుల కిందట ఎక్సైజ్ అధికారులు అనుమతులు ఇచ్చి కొత్త ప్రభుత్వ మద్యం షాపును తెరిచారు. దీంతో ఈదుపురం గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలు నీలాపుట్టుగ, కేశపురం, ఈదుపురం, సన్యాసిపుట్టుగ గ్రామ ప్రజలు అభ్యంతరం తెలిపారు. పోలీసులతో పాటు ఎక్సైజ్ సిబ్బంది సైతం మద్యం షాపు నిర్వాహకులకే వత్తాసు పలకడంతో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు మద్యం షాపును తొలగించాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అటు ప్రభుత్వం నుంచి గానీ, ఇటు ప్రజా ప్రతినిధుల నుంచి గానీ ఎలాంటి సమాధానం రాకపోవడంతో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని బడికి పంపించకుండా బాయ్‌కాట్ చేశారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖాధికారి-2 ఎస్.విశ్వనాథం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడగా.. మద్యం షాపును తొలగించే వరకు తమ పిల్లల్ని బడికి పంపించేది లేదని, సోమవారం నుంచి బడి నుంచి టీసీలు తీసుకువెళ్లిపోతామంటూ విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.

ఉన్నతాధికారులకు నివేదించా..

మద్యం షాపును తొలగించే వరకు విద్యార్థులను బడికి పంపించేది లేదని తల్లిదండ్రులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాను.

– తమ్మయ్య, హెచ్ఎం

బంగారం కోసమే వృద్ధురాలి హత్య



విలేకర్లతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం గ్రామంలో ఈ నెల 9వ తేదీన జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధురాలి మెడలో ఉన్న బంగారం కోసమే హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. దుంపల దాలమ్మ తన ఇంటిలో మోటార్ పాడైపోవడంతో ఈ నెల 8న దాన్ని బాగుచేసేందుకు అదే గ్రామానికి చెందిన బల్లి రాము అనే వ్యక్తిని పిలిచింది. రిపేర్ చేసేందుకు వచ్చిన రాము వృద్ధురాలు ఒంటరిగా ఉండటం గమనించి, ఆమె మెడలో విలువైన బంగారు తాడు ఉండటం గుర్తించి మరుసటి వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. అయితే మరుసటి రోజు రాత్రి 8గంటల సమయంలో మోటార్ మరమ్మతులు చేసేందుకు వృద్ధురాలి ఇంటికి వచ్చి ఆమెను టీ పెట్టమని చెప్పాడు. ఆమె టీ పెడుతుండగా వెనుక నుంచి వచ్చిన రాము తనతో తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో ఆమె తలపై బలంగా కొట్టి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారం గొలుసుతో అక్కడ నుంచి పారిపోయాడు. వృద్ధురాలి కుమారుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు శుక్రవారం హరిశ్చంద్రపురం బస్టాప్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి బంగారం గొలుసు, ఇనుపరాడ్డు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా నిందితుడిని స్థానిక కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.



జలుమూరు: శ్రీముఖలింగంలో కొవ్వొత్తుల ర్యాలీ



శ్రీకాకుళంలో ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విమాన ప్రమాద బాధితులకు కన్నీటి వీడ్కోలు



నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నివాళులర్పించి మౌనం పాటిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తదితరులు



పాతపట్నంలో కొవ్వొత్తుల ర్యాలీ

కన్నీటి నివాళి అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద దుర్ఘటనలో చనిపోయిన వారికి జిల్లా వాసులు కన్నీటి నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించి ప్రమాద బాధితులకు శ్రద్ధాంజలి ఘటించారు.

క్లుప్తంగా

'ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణం'


సింగుపురం మోహనరావు

టెక్కలి: కూటమి ప్రభుత్వం అరాచక వాదానికి సుప్రీం కోర్టు తీర్పు చెంప పెట్టులాంటిదని న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగుపురం మోహనరావు అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు కేసులో పోలీసులు, కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణమని తెలిపారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం స్పందిస్తూ కొమ్మినేనిని తక్షణమే విడుదల చేయాలని ఇచ్చిన తీర్పుతో కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు.

మీడియా స్వేచ్ఛపై ఆంక్షలెందుకు..?


డి.వి.వివేకానంద

టెక్కలి: మీడియా, జర్నలిస్టులకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛకు ఎలాంటి ఆంక్షలు ఉండకూడదని సీనియర్ న్యాయవాది డీవీ వివేకానంద తెలిపారు. ఎక్కడైనా తప్పు చేస్తే చట్టపరమైన చర్యలకు న్యాయస్థానాలను ఆశ్రయించాలి తప్ప అరెస్టులు, దాడులు చేయకూడదని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టును తప్పు పడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మీడియా, పత్రికా స్వేచ్ఛపై గౌరవంగా భావించవచ్చని పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ


కల్లేపల్లి ఈశ్వరమ్మ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని పీఎన్‌కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలో చైన్ తెంపేసి బైక్‌పై ఉడాయించాడు ఓ యువకుడు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పీఎన్ కాలనీ మూడో లైన్ కమల నివాస్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కల్లేపల్లి ఈశ్వరమ్మ (62) తన సోదరితో కలసి ఫ్రెండ్స్ కాలనీలో బంధువులు చనిపోవడంతో పరామర్శకు వెళ్లారు. శుక్రవారం రాత్రి తిరిగి పీఎన్‌కాలనీ రెండో లైన్ చేరేసరికి ఓ 30 ఏళ్ల యువకుడు తలకు హెల్మెట్ ధరించి రయ్‌మని దూసుకొచ్చి నడుస్తున్న వృద్ధురాలి మెడలో మూడున్నర తులాల చైన్ తెంపేసి వెళ్లిపోయాడు. దీంతో ఆమె మెడకు గాయమైంది. దీనిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పీఎన్ కాలనీలో వరుసగా చోరీలు, చైన్ స్నాచింగ్‌లు జరుగుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తెలతాడు చోరీకి విఫలయత్నం

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం గ్రామానికి సమీపంలో అదే గ్రామానికి చెందిన గేదెల మహాలక్ష్మి అనే మహిళ రహదారి నుంచి గ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో పుస్తెలతాడు తెంపుకు వెళ్లే ప్రయత్నం చేశాడు. శుక్రవారం మహాలక్ష్మీ పెద్ద లక్ష్మీపురం గ్రామానికి తన తండ్రి పెద్దకర్మకు వచ్చి తిరుగు ప్రయాణంలో గోకర్ణపురం గ్రామానికి వెళ్తుండగా..ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనం పై వచ్చి మెడలో పుస్తెలతాడు లాగే ప్రయత్నం చేశారు. మహిళ కేకలు వేయడంతో వారు పారిపోయారు. అనంతరం మహిళ మెళియాపుట్టి పోలీసులకు సమాచారం అందించారని తెలియజేశారు.

ఆలిండియా బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా మోహన్‌సాయి



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన యువ బ్యాడ్మింటన్ అంపైర్ సంపతిరావు మోహన్‌సాయినాథ్ మరో ప్రతిష్టాత్మక పోటీలకు అంపైర్‌గా వ్యవహరించనున్నాడు. మహారాష్ట్రలోని పూణే వేదికగా ఈ నెల 14 నుంచి 22 వరకు ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్–2025 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లాలోని ఎచ్చెర్ల మండలం షేర్ మహ్మద్‌పురం గ్రామానికి చెందిన మోహన్‌సాయి అంపైర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నాడు. ఈ పోటీల కోసం శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై పూణే చేరుకున్నాడు. మోహన్‌సాయి తండ్రి సంపతిరావు సూరిబాబు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారు.

అపోహలు వీడుదాం.. ఆర్తులను కాపాడుదాం



జిల్లాకు ఏడాదికి దాదాపు 60వేల యూనిట్ల రక్తం అవసరమవుతుంది. కానీ సేకరిస్తున్నది మాత్రం కేవలం 16 యూనిట్లే. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దడం చిటికెలో పని. కానీ ఎందుకనో ఆ పని జరగడమే లేదు. దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేస్తే కొరతను ఇట్టే అధిగమించవచ్చు. కానీ అవగాహన లేమి, భయం, సమాచార లోపం కారణంగా రక్తదానం చేసేందుకు చాలా మంది ముందుకు రావడం లేదు. ఈ భయం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం అందకుండాపోతోంది.

- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం
- జిల్లాలో తగ్గుతున్న రక్త నిల్వలు
- దాతలు ముందుకు రావాలని స్వచ్ఛంద సంస్థల పిలుపు

శ్రీకాకుళం కల్చరల్: దాతలు కావాలి.. రక్త దాతలు ముందుకు రావాలి. జిల్లాలో రక్తల నిల్వలు నానాటికీ తక్కువైపోతున్నాయి. దాతలు ముందుకు రాకపోతే గర్భిణుల దగ్గర నుంచి ప్రమాద బాధితుల వరకు చాలా మంది ప్రాణాపాయ స్థితిలో పడతారు. రక్తదానంపై అవగాహన విస్తృతంగా పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

జిల్లాలో రెడ్‌క్రాస్‌తో పాటుగా ప్రభుత్వ ఆస్పత్రులు, జిల్లా కేంద్రంలో 3 ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో బ్లడ్‌బ్యాంకులు ఉన్నాయి. వాటన్నింటి ద్వారా రక్త సేకరణ ఏడాదిలో కేవలం 16వేల యూనిట్లు మాత్రమే జరుగుతోంది. జిల్లాకు దాదాపు 60వేల యూనిట్లు అవసరం ఉంటుంది.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు (ఫైల్)

దీనిపై రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సి ఉందని చెప్పారు. తమ బ్లడ్‌బ్యాంకులో కూడా కూడా రక్తం అందడం కష్టంగా ఉందన్నారు.

అపోహలు వద్దు..

- చాలా మంది రక్తదానం అంటే భయపడతారు. దీనిపై చాలా అపోహలు ఉన్నాయి.
- రక్తదాన ప్రక్రియలో కేవలం 300 మిల్లీలీటర్లు మాత్రమే సేకరిస్తారు.
- సాధారణంగా మనిషిలో సరాసరి 5లీటర్ల నుంచి 6లీటర్ల రక్తం ఉంటుంది. కేవలం 300 మిల్లీలీటర్ల రక్తం దానం చేయడం వల్ల ఎలాంటి ప్రమాదం లేదు. సుఖప్రసవంలో తల్లి 700 మిల్లీలీటర్ల రక్తం కోల్పోతుంది.

ఎవరు రక్తదానం చేయవచ్చు..

కాసింత దయాగుణం.. మరికాసింత ఆరోగ్యం.. ఈ రెండూ ఉంటే చాలు.. 18–60 ఏళ్ల వారెవరైనా 45 కిలోలకు పైగా బరువు ఉండి, 12 పాయింట్లు హిమోగ్లోబిన్ ఉంటే ఎంచక్కా రక్తదానం చేయవచ్చు.

నేడు రక్తదాతల దినోత్సవం

రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు రక్తదానంపై అవశ్యకత కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. రక్తదాన శిబిరాలను కూడా నిర్వహిస్తారు.

ప్రతి మూడు నెలలకు ఇస్తాను..



నేను ప్రతి మూడు నెలలకు ఓ సారి రక్తదానం చేస్తుంటాను. మొదట్లో నాకూ భయం ఉండేది. మా మేనేజర్‌ను చూసి స్ఫూర్తి పొందాను. రెడ్‌క్రాస్ పలుసార్లు అవార్డులు, సత్కారాలు కూడా చేశారు.

– సీహెచ్ రమణమూర్తి, శ్రీకాకుళం

సాటి మనిషిని కాపాడాలనే..



నేను 49 సార్లు రక్తదానం చేశాను. ఏటా ఆగస్టు 15, మే 1, రిపబ్లిక్ డే, డిసెంబరు 25 పుట్టిన రోజున ఇస్తుంటాను.

– కేకేవీ పురుషోత్తమరావు(కల్యాణ్), విశ్రాంత మెడికల్ రిప్రజెంటేటివ్, శ్రీకాకుళం

అపోహలు వదలండి



రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి. ఎవరైనా రక్తదానం చేయవచ్చు. ఆపద సమయంలో రక్తం ఎంతో అవసరం. దాన్ని గుర్తించండి.

– పి.జగన్మోహనరావు, చైర్మన్, రెడ్‌క్రాస్

రక్తదానం ఆవశ్యకత తెలియజేస్తున్నా



రక్తదానంపై స్కూళ్లకు, కళాశాలలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాను. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు కూడా వెళ్లి వారిని రక్తదాన శిబిరాల కోసం ప్రోత్సహిస్తున్నాను. ఇప్పటికి లక్షకుపైగా మోటివేషన్ చేశాను. నేను కూడా ఇప్పటికి 25 సార్లు రక్తదానం చేశాను.

– పెంకి చైతన్యకుమార్, రెడ్‌క్రాస్ మోటివేటర్

నేడు ఉత్తరాంధ్ర గ్రంథాలయ సదస్సు

శ్రీకాకుళం కల్చరల్: గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో భాగంగా శనివారం విశాఖ పౌర గ్రంథాలయంలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు జరుగుతుందని జిల్లా కన్వీనర్ బుడుమూరు సూర్యారావు, కో కన్వీనర్ డాక్టర్ జామి భీమశంకర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ ఆచార కేఎస్ చలం అధ్యక్షతన జరిగే సదస్సుకు రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆచార్య చలంతో పాటు మరో ఐదుగురు పూర్వ వైస్ చాన్సలర్లు సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. జి.నాగేశ్వరరావు (ఆంధ్రా విశ్వవిద్యాలయం), ఆచార్య సుదర్శన్ రొక్కం (విక్రమ్ సింహపురి విశ్వవిద్యాలయం), వై.సత్యనారాయణ (దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం), డాక్టర్ హెచ్. లజపతిరాయ్ (బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం) హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజాశక్తి బుక్ హౌస్ ఎడిటర్ ఎంవి.ఎస్ శర్మతో పాటు, సాహిత్యం, జర్నలిజం, గ్రంథాలయ ఉద్యమం వంటి రంగాలకు చెందిన ప్రముఖులు కూడా హాజరవుతున్నట్లు తెలిపారు.

జూదగాళ్లపై కేసు నమోదు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి తీరం పరిసర ప్రాంతంలో శుక్రవారం పోలీసులు ఆకస్మిక దాడులు చేసి పేకాట ఆడుతున్న 11 మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5060లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.నీహార్ తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఉద్దానంలో 'జీడి బోర్డు' ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన రైతులు జీవనాధారమైన జీడి పంటకు మద్దతు ధర కల్పించి స్థానికంగా జీడి బోర్డు ఏర్పాటు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాతుపురంలో శుక్రవారం రైతు సంఘ నాయకులు, ఉద్దాన రైతులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహన్‌రావు, జీడి రైతు సంఘ జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను విస్మరించి విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం సిగ్గు చేటన్నారు. జీడి పప్పు ధరలు మార్కెట్‌లో బాగానే ఉన్నప్పటికీ జీడి వ్యాపారులు దురాశతో జీడి పరిశ్రమలకు లాకౌట్ ప్రకటించడం దారుణమని అన్నారు. జీడి రైతులను ఆందోళనకు గురి చేసి వారి నుంచి కారుచౌకగా జీడి పిక్కలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో పలు మార్లు జీడి మద్దతు ధర అంశంపై లేవనెత్తినప్పుడు సంబంధిత శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఎలాంటి సమాధానం చెప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో జీడి రైతు సంఘ నాయకులు కె.రమేష్,ఎం.కామేశ్వరరావు,మద్దు రాఘవరావు,అర్లి దానేస్, ఉప్పరపల్లి ఢిల్లీరావు, రెయ్యి మంజు, దాసరి మోహన్‌రావు, సీహెచ్ భాస్కరరావు, చిరంజీవి తదితరులు ఉన్నారు.

పోషకాల రేడు.. నేరేడు

- కిలో నేరేడు రూ.200 వరకు విక్రయం
- మితంగా తీసుకోవాలంటున్న వైద్యులు



పాతపట్నం: నేరేడు మార్కెట్‌లో మిలమిలలాడుతూ ఆకర్షిస్తోంది. నేరేడు పండుతో పాటు ఆకులు, చెట్టు, బెరడు కూడా ఆరోగ్యానికి మేలు చేసేవే. నేరేడు పండ్లను కోయడం కొంత కష్టంతో కూడుకున్న పని అందువల్లే ధర కూడా అధికంగానే ఉంటుంది. రైతు నుంచి దళారులు కిలో రూ.80కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. దళారులు వ్యాపారులకు రూ.130కు విక్రయిస్తున్నారు. వ్యాపారులు వినియోగదారులకు రూ.180 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం నేరేడు పండ్లు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. నేరేడు పండ్లను ఇక్కడి వ్యాపారులు ఒడిశా (గుణుపూర్) నుంచి దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారు.

ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలు

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కులుగుతుంది.
- మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. అలాగే కిడ్నీలను శుభ్రపరుస్తుంది.
- మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరు మెరుగుపరచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి.
- దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోటిలో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.

ఇమ్యూనిటీ పెరుగుతుంది

నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు విటమిన్లు ఉంటాయి. అందువల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఆరోగ్యానికి మంచిది. శరీరంలో చిగుళ్లు బాగుంటాయి, ఔషధ లక్షణాలు మెండుగా ఉన్నాయి.

– డాక్టర్ జి.వేణుగోపాల్, సీహెచ్‌సీ, సూపరింటెండెంట్, పాతపట్నం

పిడుగుపాటుకు నాలుగు ఆవులు మృతి


బుడుమూరులో పిడుగుపాటుకు మృతి చెందిన ఆవులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడుమూరు గ్రామంలో శుక్రవారం ఒంటిగంట సమయంలో ఉరుములతో కూడిన వర్షానికి చెట్టుమీద పిడుగుపడి కిందనున్న నాలుగు ఆవులు మృతి చెందాయి. ఇదే గ్రామానికి చెందిన పిట్ట అప్పయ్య ఓ చెట్టు కింద ఆవులు కట్టి ఉంచారు. ఒక్కసారిగా పిడుగుపడి ఆవులు మృతిచెందడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. రెవెన్యూ సిబ్బంది, పశువైద్యాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల గ్రామానికి చెందిన గురువిల్లి అసిరయ్య (79) ఈ నెల 11వ తేదీన చెరువు పనికి వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు జేఆర్ పురం పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అసిరయ్య బుధవారం చెరువు పనికి వెళ్లి ఉదయం 11 గంటలకు చెరువు పని ముగించుకుని బహిర్భూమికి వెళ్లారు. తదుపరి చెరువు తుప్పలో పడి ఉన్న విద్యుత్ వైరును గమనించకుండా తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎవరూ గమనించకపోవడంతో ఆయన కోసం రెండు రోజులు వెతికారు. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు వృద్ధుడు విద్యుత్ షాక్‌తో చనిపోయినట్లు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. భార్య అప్పయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్. చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పరికరాలు ఉన్నా.. ప్రయోజనం సున్నా


ఆస్పత్రిలో స్టాఫ్ నర్సులు తగినంత మంది లేక ఇబ్బందులు పడుతున్న రోగులు

- టెక్కలి జిల్లా ఆస్పత్రిలో సమస్యల కొలువు
- వేధిస్తున్న స్టాఫ్ నర్సుల కొరత

టెక్కలి రూరల్: స్థానిక జిల్లా కేంద్రాస్పత్రి సమస్యలతో కునారిల్లుతోంది. నిత్యం 700 వరకు ఓపీ ఉన్న ఈ ఆస్పత్రిలో సరైన వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఇక్కడ చర్మవ్యాధి నిపుణులు లేకపోవడంతో చాలా మంది ఇక్కట్లు పడున్నారు. ఆస్పత్రిలో ప్రధానంగా స్టాఫ్ నర్సుల కొరత వేధిస్తోంది. గత ప్రభుత్వంలో స్టాఫ్ నర్సులు 43 మంది ఉండగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 కంటే తక్కువ మందే పని చేస్తున్నారు. దీంతో ట్రామాకేర్, గైనిక్ వార్డు, జనరల్ వార్డులు, ఆర్థో వార్డుల్లో రోగులకు సరైన సమయంలో వైద్యం అందించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ప్రధాన సమస్యలివే..

- ఆస్పత్రిలో రేడియోలజిస్టు లేక అల్ట్రా సౌండ్ స్కానింగ్ విభాగం మూతపడింది.
- రూ.లక్షలు విలువ గల వెంటిలేటర్లు ఉన్నా, వినియోగించేందుకు నిపుణులు లేక అవి కూడా మూలకు చేరాయి.
- రూ.లక్షలు విలువ గల హార్మోన్ ఎనలైజర్ యంత్రం ఉన్నా, దానికి సంబంధించిన రసాయనాలు లేక వినియోగంలో లేకుండా పోయింది.
- ఈసీజీ టెక్నీషియన్ లేకపోవడంతో ఉన్న సిబ్బందితో పూర్తిస్థాయి అవగాహన లేకుండా ఈసీజీ ప్రక్రియ నిర్వహిస్తున్నారు.


మైక్రో బయాలజీ ల్యాబ్‌లో నిరుపయోగంగా ఉన్న పరికరాలు


రసాయనాలు లేక నిరుపయోగంగా మారిన థైరాయిడ్ పరికరం

- థైరాయిడ్ పరీక్షలకు సంబంధించిన యంత్రం ఉన్నా దానికి సంబంధించిన కెమికల్స్ లేకపోవడంతో థైరాయిడ్ పరీక్షలకు అక్కడ ఉన్న కొంతమంది సిబ్బంది బయట ల్యాబ్‌లతో మాట్లాడి చేయిస్తున్న పరిస్థితి నెలకొంది.
- ట్రామాకేర్‌కు సంబంధించిన అంబులెన్స్ పాత జిల్లా ఆస్పత్రి ఆవరణలో మూలకు చేరింది.
- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగి నెలలు గడుస్తున్నా నేటికీ నిర్వహించడం లేదు. దీంతో చాలా వరకు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఆస్పత్రికి పూర్తిస్థాయిలో దోబీ వర్కర్ లేకపోవడంతో శానిటేషన్ వర్కర్లతో పనిచేయిస్తున్నారు.
- ఆస్పత్రిలో సరిపడా వీల్‌చైర్లు, స్ట్రెచర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఆస్పత్రిలో ఉన్న లిఫ్ట్ తరుచూ పాడైపోతోంది.
- రోగులకు అవసరమైన తాగునీరు, వాడుకనీరు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు.
- కాలువ వ్యవస్థ కూడా సరిగా లేదు.
- ఫ్రీజర్లు సరిగా లేకపోవడంతో మృతదేహాలను కిందనే ఉంచాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

స్టాఫ్‌నర్సుల కొరత వాస్తవమే..

ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుల కొతర వాస్తవమే. 17 మంది తక్కువగా ఉన్నారు. బదిలీలు జరిగాక కొత్త వారు వస్తారు. థైరాయిడ్, వెంటిలేటర్ పరికరాలు త్వరలోనే వినియోగంలోకి తీసుకు వస్తాం.

– బొడ్డేపల్లి సూర్యారావు, టెక్కలి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

సుసంపెన్‌మైన ఆలోచన

- వాడిపడేసిన పెన్నుల సేకరణ
- వాటిని రీసైక్లింగ్ చేసేలా విద్యార్థులకు తర్ఫీదు
- కాశీబుగ్గ హైస్కూల్ వినూత్న ప్రయోగం

కాశీబుగ్గ: భూమి వేడెక్కిపోతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతోందని ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. కానీ ఎవరూ ప్లాస్టిక్ నిషేధం, పునర్వినియోగంపై దృష్టి సారించడం లేదు. ఈ విషయంలో కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓ అడుగు ముందుకు వేసింది. వాడి పడేసిన పెన్నులను సేకరించి వాటిని రీసైక్లింగ్‌కు ఇచ్చేలా ఓ వ్యవస్థను రూపొందించింది. పెన్నులతో సుసంపన్నమైన ఆలోచన చేసింది. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు 1038 మంది చదువుతున్నారు. పాఠశాలలో ఇంకు అయిపోయి పనికిరాని పెన్నులను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. ఇవి పిల్లల కాళ్లకు గుచ్చుకుంటూ ఇబ్బంది పెట్టేవి. ఇప్పుడు మాత్రం అలా కాకుండా పాఠశాలలో ఓ పచ్చని చెట్టుకు 'యూజ్ మి' అని ఓ బాక్సును ఏర్పాటు చేశారు. దానిపై ప్లాస్టిక్ పెన్నులు వాడిన అనంతరం ఇందులో వేయాలని రాశారు. అక్కడితో ఆగకుండా ప్రధానోపాధ్యాయులు పాఠశాల సర్క్యులర్‌లో పొందుపరిచి దానికి ప్రతి తరగతి గదికి అమలు చేసే బాధ్యత క్లాస్ లీడర్‌లకు అప్పగించారు. ఇంకేముంది పాఠశాలలో వెయ్యి మంది విద్యార్థులు ఉండడంతో రోజుకు పదుల సంఖ్యలో పెన్నులు బాక్సులోకి చేరుతున్నాయి. నిండిన బాక్సును మరి కొంతమంది కమిటీ సభ్యులు సేకరించి బస్తాల్లో వేస్తున్నారు. అలా ప్లాస్టిక్ పెన్నులు బస్తాలుగా మారుతున్నాయి. వాటితో ప్రాజెక్టులు చేయడానికి, రీసైక్లింగ్‌కు ఉపయోగించాలని ప్రత్యక్షంగా నేర్పిస్తున్నారు. దీంతో పాటు ప్లాస్టిక్ దుకాణాలకు అమ్మి వాటితో మొక్కలు కొనుగోలు చేయడం వంటి పనులు కూడా చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు సైతం అలవాటైంది. ఈ పాఠశాలలో జరుగుతున్న ఈ విధానం అన్ని పాఠశాలలకు తెలిస్తే ఇంకా సంతోషిస్తామని విద్యార్థులు చెబుతున్నారు.



వాడిన పెన్నుల సేకరణకు ఏర్పాటు చేసిన బాక్సు


బాక్సు నుంచి సేకరించిన పెన్నులు

వ్యర్థానికి అర్థం



నేను హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ఎక్కడ చూసినా వాడిన పెన్నులు కనిపించాయి. వాటిని నేను సేకరించి బయట పారవేసేవాడిని. రోజు గడిచాక మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చేది. అప్పుడే ఉపాధ్యాయుల సహకారంతో వాడిన పెన్నులు రీసైక్లింగ్‌కు ఇవ్వాలనే ఆలోచనతో ఇలా బాక్సును పెట్టాం. పనికిరాని వస్తువంటూ ఏమీ ఉండదని, అన్ని ఉపయోగపడతాయని పిల్లలకు చెబుతున్నాం. అన్ని పాఠశాలలు మాలా చేస్తూ ఇంకా సంతోషిస్తాం.

– చిన్నంనాయుడు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల, కాశీబుగ్గ

దారి ఇలా.. వెళ్లేదెలా..?



లావేరు మండలంలోని తాళ్లవలస గ్రామంలోని ప్రధాన వీధి మురికికూపంలా దర్శనమిస్తోంది. ఇక్కడ ప్రధాన వీధికి ఆనుకుని ఉన్న మురికికాలువలో మురికి నీరు నిల్వ ఉండిపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు బెడద పెరిగిపోయి రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

– ఎచ్చెర్ల